క్లుప్తంగా

మంత్రి పొన్నంకు ఆహ్వానం



పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వాన పత్రికను అందిస్తున్న ఈఓ

హుస్నాబాద్‌రూరల్‌: మండలంలోని పొట్లపల్లిలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు రావాలని కోరుతూ ఆలయ ఈఓ కిషన్‌రావు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆదివారం ఆహ్వాన పత్రిక అందించారు. 25 నుంచి 27 వరకు పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఏ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఈఓకు మంత్రి సూచించినట్లు తెలిపారు. ఆయన వెంట అర్చకుడు సతీశ్‌శర్మ తదితరులు ఉన్నారు.

చెరువులు నింపాలంటూ రైతుల నిరసన



నిరసన తెలుపుతున్న రైతులు

నంగునూరు(సిద్దిపేట): రంగనాయక సాగర్‌ నీటితో గ్రామ పరిధిలోని చెరువులు నింపాలని డిమాండ్‌ చేస్తూ ఆదివారం మంగ్దంపూర్‌ స్టేజీ వద్ద రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పరశురాములు, కనుకయ్య మాట్లాడుతూ గ్రామంలోని చెరువులు నీళ్లు లేక వెలవెల బోతున్నాయన్నారు. రంగనాయకసాగర్‌ నీటిని విడుదల చేయడంతో చుట్టుపక్కల గ్రామాల్లోని చెరువులు నిండుతున్నాయని, తమ గ్రామంలో కాల్వల నిర్మాణం పూర్తికాక పోవడంతో నీరు చేరడంలేదని వాపోయారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్‌ అధికారులు సమస్య పరిష్కరిస్తామని ఫోన్‌లో హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. నిరసనలో రాజు, కొమురయ్య, రామచంద్రం, తిరుపతి, యాదయ్య, యాదిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడి మృతి



గోపాల్‌(ఫైల్‌)

ములుగు(గజ్వేల్‌): మండల కేంద్రానికి చెందిన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దోసపాటి గోపాల్‌(59) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. రెండేళ్లుగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయన పలు సేవా కార్యక్రమాలను చేపట్టి ప్రజల మన్ననలను పొందారు. ఆయన మరణానికి మండల ఆర్యవైశ్య సంఘం నేతలు ఆంజనేయులు, రంగయ్య, గణేశ్‌గుప్త, శ్రీనివాస్‌గుప్త ఆయా పార్టీల నేతలు రమేశ్‌రెడ్డి, సయ్యద్‌ సలీం, అంజిరెడ్డి, నరేశ్‌గౌడ్‌, జుబేర్‌పాష తదితరులు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఆపదలో అండగా..



నగదు అందిస్తున్న మల్లారెడ్డి

దుబ్బాకటౌన్‌: మున్సిపల్‌ పరిధిలోని చెల్లాపూర్‌ 3వ వార్డుకు చెందిన పోతరాజు కిషన్‌ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. కిషన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న మాజీ కౌన్సిలర్‌ మల్లారెడ్డి బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు. ఎంపీ రఘునందన్‌రావు, ప్రభుత్వ సహకారంతో బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కంకణాల బాబు, మహేందర్‌ రెడ్డి, శ్రీరాజ్‌, నర్సింహులు, స్వామి, రాజు, నరేశ్‌, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

కులగణనకు మరో అవకాశం



సేవా కేంద్రంలో సిబ్బంది

హుస్నాబాద్‌రూరల్‌: ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక, సామాజిక, విద్య, కులగణనలో పాల్గొనని వారి మరో అవకాశం కల్పించిందని మున్సిపల్‌ కమిషనర్‌ మల్లికార్జున్‌ తెలిపారు. ఆదివారం మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రజా పాలన సేవా కేంద్రం ఏర్పాటు చేశారు. కుల గణన సర్వేలో పాల్గొనని వాళ్లు సేవా కేంద్రానికి వస్తే దరఖాస్తులను తీసుకుంటారని చెప్పారు. కులగణన సర్వే దరఖాస్తులను ఆన్‌లైన్‌ డౌన్‌లోడ్‌ చేసుకొని సేవా కేంద్రంలో కూడా అందజేయవచ్చని చెప్పారు.

‘అమ్మ ఆదర్శ’ం జాప్యం

పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలలకు శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వం ‘మన ఊరు మన బడి’ కార్యక్రమంలో భాగంగా బడుల అభివృద్ధికి కృషి చేసింది. పాఠశాలల నిర్మాణాలు, మరమ్మతుల పనులు ప్రారంభించారు. అయితే చాలా పాఠశాలల్లో ఆ పనులు నిలిచిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం కూడా అమ్మ ఆదర్శ పాఠశాలలకు నిధులు మంజూరు చేసింది. అయినప్పటికీ పనుల్లో జాప్యం కొనసాగుతూనే ఉంది. దీంతో అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులకు ఇబ్బందులు తప్పడం లేదు.

- నాలుగు పాఠశాలల్లో నిలిచిన పనులు
- మిగిలిన చోట్లా నత్తనడకనే..
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



బీజీవెంకటాపూర్‌ పాఠశాలలో నత్తనడకన సాగుతున్న పనులు

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): మండలంలో మొత్తం 34 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అమ్మ ఆదర్శ పాఠశాల కింద వాటన్నిటినీ ఎంపిక చేశారు. విద్యార్థుల సంఖ్యను బట్టి నిధులు మంజూరు చేసింది ప్రభుత్వం. గతేడాది నుంచి నిర్మాణ పనులు ప్రారంభించారు.

వసతుల కోసం పనులు

పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం, మరమ్మతు పనులు, విద్యుత్‌ సౌకర్యం, ఫ్యాన్ల ఏర్పాటు, నీటి సంపుల నిర్మాణం, డైనింగ్‌ హాల్‌ తదితర కనీస వసతుల కోసం పనులు మొదలు పెట్టారు. యేడాది నుంచి వివిధ పాఠశాలలో పనులు సాగుతూనే ఉన్నాయి. ఇటిక్యాల జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో డైనింగ్‌ హాల్‌ పనులు చివరి దశలో ఉండగా నేటికీ పూర్తి చేయలేకపోతున్నారు. వట్టిపల్లి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల నిర్మాణ పనులు పిల్లర్ల స్థాయిలో నిలిచిపోయాయి. బీజీ వెంకటాపూర్‌, వట్టిపల్లి, చాట్లపల్లి, పలుగుగడ్డ పాఠశాలలో మరమ్మతు పనులు నత్తనడకన సాగుతున్నాయి.

బిల్లుల్లో జాప్యం

సకాలంలో బిల్లులు రావడం లేదని సదరు కాంట్రాక్టర్లు పనులు చేయడంలో జాప్యం చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. మరికొన్ని పాఠశాలల్లో అయితే చిన్నచిన్న పనులు పూర్తిచేయడంలో కూడా నిర్లక్ష్యం కొనసాగుతోంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని పాఠశాలల్లో వంట గదులు లేక వరండాల్లోను, చెట్ల కిందనే వంటలు చేస్తున్నారు.



వట్టిపల్లి పాఠశాలలో నిలిచిన డైనింగ్‌ హాల్‌ నిర్మాణం

> **వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటాం**
>
> వట్టిపల్లి నుంచి సాల్వపూర్‌ రోడ్డు నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతుందన్న మాట వాస్తవమే. నిర్మాణ పనుల్లో వేగం పెంచేలా చర్యలు తీసుకుంటాం. వాహనదారులకు ఇబ్బందులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటాం.
>
> – వెంకటేశం, ఆర్‌అండ్‌బీ డీఈ

పూర్వ విద్యార్థుల ఆపన్న హస్తం

దుబ్బాకటౌన్‌: తమతో కలిసి చదువుకున్న మిత్రుడి కుటుంబం ఆపదలో ఉందని తెలుసుకొని, తలా కొంత పోగేసుకొని ఆ కుటుంబాన్ని ఆదుకున్నారు. గుండెపోటుతో అకాల మరణం చెందిన స్నేహితుడి కుటుంబానికి పూర్వవిద్యార్థులు రూ.30 వేలు ఆర్థిక సాయం అందించారు. అంతే కాకుండా పిల్లలపై చదువుల కోసం అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. దౌల్తాబాద్‌ మండలం సూరంపల్లికి చెందిన ప్రభాకర్‌ సిద్దిపేటలోని స్టూడెంట్‌ మేనేజ్‌మెంట్‌ హాస్టల్‌లో ఉంటూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యను అభ్యసించాడు. అనంతరం గజ్వేల్‌ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రైవేటు జాబ్‌ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకున్నాడు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో అతడితో కలిసి చదువుకున్న మిత్రులు ఎస్‌హెచ్‌ఎమ్‌ వాట్సాప్‌ గ్రూప్‌ ద్వారా సమాచారం తెలుసుకుని రూ.30 వేలు సేకరించారు. ఆదివారం ఆ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సదానందం, బాబు, రమేశ్‌, దశరథ్‌ తదితరులున్నారు.



ఆర్థిక సహాయం అందిస్తున్న మిత్రులు

కాంగ్రెస్‌ ఎమ్మెల్సీ అభ్యర్థికి జేఏసీ మద్దతు



సమావేశంలో పాల్గొన్న లక్ష్మారెడ్డి తదితరులు

హుస్నాబాద్‌రూరల్‌: నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి జేఏసీ మద్దతు తెలుపుతుందని నాయకుడు లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం రిటైర్డు ఉద్యోగుల భవనంలో జేఏసీ ముఖ్యనాయకుల సమావేశంలో పలువురు నాయకులు, విద్యావంతులు ప్రజాపాలనపై చర్చించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, వాటికి తోడు కాంగ్రెస్‌ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలిస్తే మరింత పట్టు ఉంటుదని అభిప్రాయపడ్డారు. హుస్నాబాద్‌ను అభివృద్ధి చేసుకోవాలంటే కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. సమావేశంలో జేఏసీ కోఆర్డినేటర్‌ వీరన్నయాదవ్‌, సారయ్య, ప్రకాశ్‌, లక్ష్మణ్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌ సమక్షంలో బీజేపీలోకి..

హుస్నాబాద్‌: నియోజకవర్గంలోని పలువురు కాంగ్రెస్‌ నాయకులు కేంద్ర మంత్రి బండి సంజయ్‌ ఆధ్వర్యంలో ఆదివారం బీజేపీలో చేరినట్లు పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్‌ తెలిపారు. పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించడం కోసం హుస్నాబాద్‌, సైదాపూర్‌, కోహెడ, అక్కన్నపేట మండలాల నుంచి 100 మందికి బండి సంజయ్‌ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించినట్లు తెలిపారు. వారి వెంట విలాసాగరం మురళీమోహన్‌, రామంచ మహేందర్‌రెడ్డి, మాచర్ల కుమార్‌, చిరంజీవి తదితరులు ఉన్నారు.



రవికుమార్‌ రెడ్డికి కండువా కప్పుతున్న బండి సంజయ్‌

నిర్లక్ష్యానికి తుప్పు

చిన్నకోడూరు పోలీస్‌స్టేషన్‌లో సీజ్‌ చేసిన వాహనాలు పెరిగిపోతున్నాయి. రోడ్డు ప్రమాదానికి గురైన వాహనాలతో పాటు వివిధ కారణాలతో పట్టుపడిన వాహనాలను తగిన జరిమానా చెల్లించి వాహనదారులు తీసుకొనిపోవాల్సి ఉంటుంది. కానీ వివిధ కారణాలతో యాజమానులు వాటిని వదిలేసి వెళ్తున్నారు. దీంతో ఆ వాహనాలు ఎండకు ఎండి, వానకు తడుస్తూ తుప్పుపట్టి పోతున్నాయి.



పోలీస్‌స్టేషన్‌ ఆవరణలో తుప్పు పడుతున్న వాహనాలు

దుమ్ము లేస్తోంది..

నాలుగు వరుసల రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా చిన్నకోడూరు శివారులో కిలో మీటర్‌ మేర బీటీ రోడ్డును తొలగించి మట్టి పోసి వదిలేశారు. నెలలు గడుస్తున్నా పనులు పూర్తి చేయకపోవడంతో ఆ రోడ్డు గుండా వాహనాలు వెళ్తున్నప్పుడు దుమ్ము రేగుతోంది. దీంతో ద్విచక్రవాహనదారులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. దుమ్ము కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వాహనం వెళ్తుండగా రేగుతున్న దుమ్ము

నేడు విద్యుత్‌కు అంతరాయం

దౌల్తాబాద్‌(దుబ్బాక): రాయపోలు, దౌల్తాబాద్‌ మండలాలలోని అనాజీపూర్‌, వడ్డేపల్లి, రామారం, రాంసాగర్‌, వీర్‌నగర్‌, సూరంపల్లి, ముత్యంపేట ముత్యంపేట, గాజులపల్లి, రాంసాగర్‌, గుర్రాలసోఫా, మాచిన్‌పల్లి, అనాజీపూర్‌, గొడుగుపల్లి, మహ్మద్‌షాపూర్‌ గ్రామాలలో సోమవారం విద్యుత్‌ సరాఫరా నిలిపివేస్తామని తుక్కాపూర్‌ ఏడీఈ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలని కోరారు.

అలరించిన అవధానాలు



అవధానం చేస్తున్న పట్వర్ధన్‌

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): స్థానిక లలిత చంద్ర మౌళీశ్వర దేవస్థానంలో ప్రముఖ అవధాని మారెపల్లి పట్వర్ధన్‌ ఆదివారం రాత్రి ఒకేసారి ఆరు అష్టావధానాలుచేసి అలరించారు. ఈ అవధానాలపై సాహిత్యప్రియులు ఆనంద వ్యక్తం చేశారు. పద్య సాహిత్యం అవధానాలతో పరిడవిల్లుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పండరి రాధాకృష్ణ, ఉండ్రాళ్ల రాజేశం, రాజయ్య, అశోక్‌, గాయత్రిదేవి, భ్రమరాంబిక, శ్రీదేవి, నాగేశ్వర్‌రావు, అనురాధ, సంధ్యారాణి, శిరీష, భావన తదితరులు పాల్గొన్నారు.

బహిరంగసభ పోస్టర్‌ ఆవిష్కరణ



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని 19న సిద్దిపేటలో నిర్వహించే భారీ బహిరంగ సభకు ప్రతి హిందువు హాజరై విజయవంతం చేయాలని హిందూవాహిని రాష్ట్ర కార్యదర్శి కస్తూరి భూంరెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని గంగాపూర్‌లో బహిరంగ సభ, బైక్‌ ర్యాలీ వాల్‌ పోస్టర్‌లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయంత్రం 4 గంటలకు సిద్దిపేటలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయం నుంచి శివాజీ విగ్రహం వరకు బైక్‌ ర్యాలీ, అనంతరం భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు.

బీరప్ప కల్యాణానికి గంగపూజ

కల్హేర్‌(నారాయణఖేడ్‌): గొల్లకురుమ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న బీరప్ప స్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు విగ్రహాలను చెరువు వద్దకు తరలించి గంగపూజ చేశారు. డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగించారు. కార్యక్రమంలో గొల్లకురుమ సంఘం నాయకులు సాయిగొండ, గంగదాస్‌, కేషిగొండ, మల్లుగొండ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అంజిరెడ్డికి మద్దతుగా బీజేపీ ప్రచారం

అక్కన్నపేట(హుస్నాబాద్‌): మండల కేంద్రంతో పాటు మోత్కులపల్లి, పెద్దతండా, పంజాగుట్ట తండా, మల్లంపల్లిలో ఆదివారం బీజేపీ మండలాధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నమలై అంజిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పట్టభద్రుల ఓటర్లను కలిసి రాష్ట్రంలోను, కేంద్రంలోను చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మోహన్‌నాయక్‌, తిరుపతి నాయక్‌, రవికుమార్‌, రైనా నాయక్‌, మాజీ సర్పంచ్‌ రాజునాయక్‌, రవీందర్‌ పాల్గొన్నారు.

ఇంటింటా..

బెజ్జంకి(సిద్దిపేట): కరీంనగర్‌, మెదక్‌, నిజామాబాద్‌, ఆదిలాబాద్‌ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అంజిరెడ్డిని, టీచర్స్‌ ఎమ్మెల్సీగా మల్క కొమురయ్యకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరుతూ బీజేపీ మండల నాయకులు రేగులపల్లెలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రభారి సతీశ్‌రెడ్డి, గ్రామ ప్రభారి శ్రీనివాస్‌, శివచరణ్‌, వినీత్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.



అక్కన్నపేటలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

సమస్యలపై అవగాహన కలిగిన వ్యక్తి

హుస్నాబాద్‌రూరల్‌: ఉపాధ్యాయుల సమస్యలపై అవగాహన కలిగిన వ్యక్తి మల్క కొమురయ్య అని సీపీఎస్‌ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణకుమార్‌ అన్నారు. హుస్నాబాద్‌లో ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్సీగా కొమురయ్యకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, నాణ్యమైన విద్యా బోధన, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కొమురయ్య ఎంతో కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో భాస్కర్‌, యాద రవి, శ్రీనివాస్‌, వీరారెడ్డి పాల్గొన్నారు.

సేవాలాల్‌ మార్గం స్ఫూర్తి దాయకం



భోగ్‌బండార్‌ కార్యక్రమంలో పాల్గొన్న గిరిజనులు

మద్దూరు(హుస్నాబాద్‌): బంజారాల ఆరాధ్య దైవమైన సంత్‌ సేవాలాల్‌ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని గిరిజన విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లకావత్‌ దేవేందర్‌ అన్నారు. ఆదివారం ధూల్మిట్ట మండలంలోని బెక్కల్‌ గ్రామ పరిధిలోని శివాలి తండాలో సేవాలాల్‌ లెజెండ్‌ యూత్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో సంత్‌ శ్రీశ్రీ సేవాలాల్‌ మహరాజ్‌ 286వ జయంతి ఉత్సవాలలో భాగంగా భోగ్‌ భండార్‌ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేందర్‌నాయక్‌ మాట్లాడుతూ అహింస, మత్తుపానీయాలు, మూఢనమ్మకాలు, దురాచారాలను రూపుమాపడానికి సేవాలాల్‌ ఎంతో కృషి చేశారన్నారు. ప్రజల్లో జ్ఞానాన్ని బోధించారని చెప్పారు. కార్యక్రమంలో తండా పెద్దలు హరిలాల్‌నాయక్‌, బీక్యానాయక్‌, కిషన్‌, రూప్లా, రాజు, లక్ష్మణ్‌, రెడ్యానాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థి యువజన సంఘం

కెప్టెన్‌ చౌడుతండాలో జయంతి

అక్కన్నపేట(హుస్నాబాద్‌): సేవాలాల్‌ మహరాజ్‌ ఒక సంఘసంస్కర్త, బంజారాల ఆరాధ్యదైవం, ప్రకృతి ప్రేమికుడు, జాతి ఉద్ధారకుడు అని ఆల్‌ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ధరావత్‌ తిరుపతినాయక్‌ అన్నారు. అక్కన్నపేట మండలం కెప్టెన్‌ చౌడుతండాలో ఆదివారం సేవాలాల్‌ మహరాజ్‌(286)వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని భోగ్‌ భండార్‌ ముంగింపు కార్యక్రమం నిర్వహించారు. నీటిపారుదల శాఖ ఈఈ రామునాయక్‌, అమిగోస్‌ ఐఏఎస్‌ కోచింగ్‌ సెంటర్‌ వ్యవస్థాపకుడు రమణారెడ్డి, నాయకులు రాజునాయక్‌, భూక్య రమేశ్‌ నాయక్‌, జవహర్‌ నాయక్‌, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థికి ఘన సన్మానం

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): కరీంనగర్‌ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న జగ్గు మల్లారెడ్డిని న్యూరెడ్డి సంఘం జిల్లా కేంద్రంలోని తమ కార్యాలయంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు తోర్నాల దుర్గారెడ్డి మాట్లాడుతూ 32 సంవత్సరాలుగా విద్యారంగంలో సేవలు అందిస్తున్న మల్లారెడ్డి ఎమ్మెల్సీగా పోటీచేయడం సంతోషంగా ఉందన్నారు. ఎంతో మందిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన ఆయనకు ఉపాధ్యాయులంతా తమ మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి సమాజ అభివృద్ధికి పాటుపడాలన్నారు. సమాజానికి మరింత సేవ చేయాలనే ఈ ఎన్నికల్లో పోటీచేస్తున్నానని, ఉపాధ్యాయులు, అధ్యాపకులు తమ మొదటి ప్రాధాన్యత ఓటువేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం జిల్లా ప్రతినిధులు మహేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, పద్మారెడ్డి పాల్గొన్నారు.



మల్లారెడ్డిని సన్మానిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

ఘనంగా దర్గా ఉత్సవాలు

పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్‌ ప్రతాప్‌రెడ్డి



ఉర్సులో పాల్గొన్న నర్సారెడ్డి తదితరులు

గజ్వేల్‌రూరల్‌: పట్టణంలోని గ్యార షహిద్‌ దర్గాలో ఉత్సవాలు రెండ్రోజుల పాటు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శనివారం రాత్రి ముతావలి అబ్దుల్‌ గఫార్‌, మహ్మద్‌ జకియొద్దీన్‌, సయ్యద్‌ మతిన్‌, పర్వేజ్‌ అహ్మద్‌, మహ్మద్‌ రఫియొద్దీన్‌ ఆధ్వర్యంలో గంధం తీయడంతో పాటు ఆదివారం తెల్లవారుజాము వరకు కవ్వాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్‌ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్‌ ఏఎంసీ చైర్మన్‌ నరేందర్‌రెడ్డి, వైస్‌చైర్మన్‌ సర్దార్‌ఖాన్‌తో పాటు ఆయా పార్టీల నాయకులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే ఆదివారం సైతం దీపాలు కార్యక్రమాన్ని చేపట్టారు. కాగా గ్యార షహిద్‌ దర్గాలో జరిగిన ఉర్సులో గజ్వేల్‌–ప్రజ్ఞాపూర్‌ మున్సిపాలిటీతో పాటు సమీప ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయ కమిటీ చైర్మన్‌కు ఎమ్మెల్యే పరామర్శ

మిరుదొడ్డి(దుబ్బాక): ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బండ మల్లన్న ఆలయ కమిటీ చైర్మన్‌ లింగాల వెంకట్‌రెడ్డిని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ చైర్మన్‌ బక్కి వెంకటయ్య ఆదివారం పరామర్శించారు. మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి–జంగల్లి శివారులోని బండ మల్లన్న ఆలయ కమిటీ చైర్మన్‌ వెంకట్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ రాష్ట్ర యువజన నాయకుడు సతీశ్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్‌ సత్యనారాయణ, యాదగిరి, జెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వెంకట్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, వెంకటయ్య తదితరులు

క్రీడలలో గెలుపోటములు సహజం



విన్నర్‌ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు, నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): క్రీడలలో గెలుపోటములు సహజమని ఆర్‌వీఎంబీ అకాడమీ నిర్వాహకులు మానాల రవి అన్నారు. బెజ్జంకిలో ఆ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్‌ టూ ఆల్‌ క్రికెట్‌ ముగింపు సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగుపడుతాయన్నారు. అనంతరం విన్నర్‌గా నిలిచిన గుండారం గ్రామ రిషి జట్టుకు రూ.50వేలు, రన్నర్‌గా నిలిచిన గుగ్గిల్ల మూన్‌ స్టార్‌ జట్టుకు రూ.25 వేలతో పాటు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు వెంకటేశ్‌, మధు, ప్రశాంత్‌, నాయకులు, ఉపాసకురాలు హరిప్రియ, లక్ష్మణ్‌, రూపేశ్‌, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.